బాండెడ్ లేబర్

దూరం నుంచి లీలగా ఒక సన్నని ఆకారం ముందుకు వస్తూంది. గంటకు మూడుమైళ్ళ వేగంతో మూడువందల వంకరలతో సామ్రాజ్యం పోగొట్టుకున్న రాజకుమారుడిరా ఒక అరగంట సేపట్లో తలుపుల్లేని తాలూకా ఆఫీసు ప్రహరీ గోడల్ని దాటుకుని లోపలికి ప్రవేశించిందా ఆకారం. ఎదుగూ బొదుగూ లేని పేరు గొప్పదనిపించే రెవెన్యూ డిపార్టు మెంటులో ఇరవయ్ అయిదేళ్ళ నుంచి అదే కుర్చీలో కూర్చుని కుంకి పాట్లు పడే ఎల్.డి. గుమస్తా సుందరరావే ఆ ఆకారమని కొత్తవాళ్ళకేం తెలుసు?

అతను కూర్చునే కుర్చీ మూడు కాళ్ళదయింది. దాని కున్న రెండు హాండ్సు పోయాయి. టేబులంతా నీళ్ళు లేని బావుల్లాగా పెద్ద పెద్ద గుంటలు పడ్డాయి. దానితోపాటు సుందరరావు కళ్ళూ గుంటలు పడ్డాయి కాని దిక్కుమాలిన ప్రమోషను ఇంకారాలేదు. అతని పేరు ఎంత అందంగా ఉంటుందో, రూపం దానికంత వ్యతిరేకంగా ఉంటుంది.

"సార్! తమర్ని అయ్యగారు రమ్మంటున్నారు" అన్నాడు బంట్రోతు నారాయణ, సదరు సుందరరావు స్టాండులేని సైకిల్ని గోడకు ఆనించేలోగానే.

సుందరరావు వెనక సీటులో ఫైళ్ళు కట్టిఉన్న పాడ్ చేతికి తీసు కుని లోపలకు ప్రవేశించి తహశీల్దార్‌గారికి సాష్టాంగ, దండప్రమాణాన్ని మించే విధంగా నమస్కారం చేశాడు. సెకండుకు రెండు సంతకాల చొప్పున టేబిల్ మీద రెండువైపులా ఎత్తుగా పోటీల మీద పెరిగిన ధరల్లా ఉన్న అసైన్‌మెంట్ పట్టాల మీద బరబరా గీకేస్తున్న సదరు

తహశీల్‌దార్‌గారు తలెత్తకుండానే "కాన్ఫరెన్స్ పర్టిక్యులర్స్ తయారు అయ్యాయా?" అన్నాడు.

"అయ్యాయి సార్!"

పక్కనే వెదురుగడలను క్రమపద్ధతిలో ఉంచి, వాటికి పాంటు, షర్టు, తొగిగినట్టున్న యు.డి. గుమస్తా శంకరరావు బైనాక్యులర్స్‌లాంటి అద్దాల్లోంచి 'రక్షించబడ్డావు' అన్నట్లు సుందరరావు వైపు చూశాడు.

"సార్! తహశీల్దార్‌గారు మీకు కాన్ఫరెన్స్ పర్టిక్యులర్స్ ఇవ్వమన్నారు"

"కాన్ఫరెన్సేమిటి? పర్టిక్యులర్సేమిటి?" ఎగిరిపడ్డాడు హెడ్‌క్లర్క్ తిట్టడానికి అవకాశం ఏముందా అని ఒక వైపు ఆలోచిస్తూనే.

"అదే సార్! నిన్న సర్క్యులర్ పంపించారు గదా! ఈరోజు సాయంత్రం రెవెన్యూ మినిస్టర్ మన తాలూకాను విజిట్ చేస్తున్నారని, అందుకుగాను నా సీటుకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ 'బాండెడ్ లేబర్' మీద వ్రాసుకొచ్చాను"

"హుఁ అక్కడ పెట్టి వెళ్ళు" వెధవ బుర్ర. వీడిని తిట్టడానికి ఏ పాయింటూ తట్టడంలేదు నాకంటే పదేళ్ళు సర్వీస్ ఎక్కువయినంత మాత్రాన నాకు నమస్కారం పెట్టాల్సిన విషయం తెలియదూ? ఎంతైనా వాడు ఎల్.డి. గుమస్తా. నేను హెడ్ గుమాస్తాను. ఈనాటి కుర్రాళ్ళలా తయారవుతున్నాడు. అయినా ఎక్కడకు పోతాడులే" మనసులోనే అనుకున్నాడు హెడ్‌క్లర్క్ భజగోవిందం.

ఇతనికి తనని గురించే పదేపదే భజన చేస్తుంటే భలే ఆనందపడి పోతుంటాడు.

వెళుతున్న సుందరరావును మళ్ళా పిలిచాడు.

"ఇదిగో! అఫీస్‌కి రావాల్సిన టైమెంత?"

"ఉదయం పదిన్నర గంటలకు రావాలి సార్!"

"మరిప్పుడు టైమెంత?"

"తొమ్మిది కావస్తూంది సార్!"

"ఐతే ఇప్పుడా వచ్చేది?"

"నేను ఏడుగంటలకే వచ్చాను సార్! తహశీల్దార్‌గారు మినిస్టర్ గారికి బంగళా ఏర్పాటు చూడమన్నారు. అక్కడ కాస్త ఆలస్యం అయ్యింది"

"నువ్వేమైనా చెప్పు. ఇది రెవెన్యూ డిపార్టుమెంట్. ఉదయం ఆరు గంటలవరకు...మరలా సాయంత్రం ఆరు గంటలనుండి ఉదయం ఆరు గంటలవరకు మొత్తం ట్వెంటీఫోర్ అవర్స్ డ్యూటీ చేయవలసి ఉంటుంది. అప్పుడే నీకు రావలసిన జీతం నాలుగు కాసులూ వస్తాయి. మనిషన్న తరవాత సిన్సియర్‌గా ఉండాలోయ్"

"అలాగే సార్" అంటూ వెనక్కు తిరగబోయాడు సుందర రావు.

"ఇదిగో, సుందర్రావ్. సిన్సియారిటీ గురించి ఒక ఉదాహరణ చెపుతా విను...ఒకప్పుడు కలెక్టర్‌గారు బంగాళాఖాతం అంచునే ఉన్న ఒక పట్టపుపాళెం విజిట్ చేశారు కలెక్టర్ దొరవారు గదా అని మంచి ఆర్భాటం చేశారు. సముద్రం అంచునే షామియానావేసి పందిరి తయారు చేశారు. కలెక్టర్, ఆయన ప్రక్కనే పి.ఏ. కలెక్టర్ కెదురుగా తహశీల్దార్ కూర్చున్నారు. మిగతా ప్రజలంతా నిలబడి ఉన్నారు. సముద్రపు పిల్ల గాలులు వారి శరీరాల్ని స్పర్శిస్తున్నాయి. సముద్రపు అలలు వారికి సమీ పంగా వచ్చి వెనక్కి పోతున్నాయి.

మాట్లాడుతూ, మాట్లాడుతూ ఉన్నట్టుండి సీరియస్‌గా 'ఈ బంగాళాఖాతంలో దూకండి' అన్నాడు కలెక్టర్!

"అలాగే సార్" అంటూ అప్పటికే తహశీల్దార్‌గారు 'ఎందుకు దూకమన్నాడు బంగాళాఖాతంలో? ఎందుకు దూకాలి? అని కూడా ఆలోచించకుండా నిలువెత్తు అలలతో భయంకరంగా గర్జిస్తున్న బంగాళాఖాతంలో దభీమని దూకేశాడు. 'సిన్సియారిటీ అంటే అదోయ్ సుందర రావ్' వూపిరి పీల్చుకున్నాడు హెడ్ క్లర్క్, ముక్కు విదిలించి కొద్దిగా నస్యం ఎక్కిస్తూ.

"తరువాత ఏమయింది సార్!" అన్నాడు సుందరరావు ఆత్రుతగా.

హెడ్ క్లర్క్ చిరుమందహాసం చేశాడు.

"అసలు నిజానికి కలెక్టర్‌గారు అన్నది అది కాదోయ్...గవర్నమెంట్ మీకు ఇండ్లు కట్టించమని లక్షరూపాయలు గ్రాంటు చేసింది. మేము మీ వూరికి వస్తున్నామని తెలిసి కూడా అందరూ చేపలు పట్టడానికెళితే మేమిచ్చే సహాయం మీకెలా అందుతుంది...ఎప్పుడైనా తుఫాను వస్తే అందరూ సముద్రంలో కొట్టుకుపోతారు. అందుకని ఇప్పుడీ బంగాళాఖాతంలో దూకండి అని జాలర్ల నుద్దేశించి కోప్పడి తహశీల్దార్ వైపుకు తిరిగి "ఏమంటారు?" అన్నాడు. అంతే! ఏదో ఆలోచిస్తున్న తహశీల్దార్ చివరి మాటే అన్నాడు. 'అలాగే సార్' అంటూ బంగాళాఖాతంలో దూకేశాడు..."

"తరువాత సార్..." సుందరావు ఒక చేత్తో ముఖంమీద చెమట తుడుచుకుంటూ ఆత్రుతగా అడిగాడు.

"తరవాత ఏముంది? కలెక్టర్‌గారితో సహా అందరూ భయపడ్డారు

అరితేరిన జాలర్లు తహశీల్‌దార్‌ను రక్షించారనుకో" అన్నాడు హెడ్ క్లర్క్.

"ఇంతకీ నే చెప్పేదేమిటంటే, మర్యాద నేర్చుకో, సిన్సియర్‌గా ఉండు అంటాను రాగానే తహశీల్దార్‌గారికి, డిప్యూటీ తహశీల్‌దార్‌గారికి. తరవాత నాకు గుడ్‌మార్నింగ్ చెయ్—బాగుపడతావు"

"సరే సార్! తమరు చెప్పినట్లే చేస్తాను" సీట్లో వచ్చి కూలబడ్డాడు.

తనేం తప్పు చేశాడని ఇన్ని చెప్పాడు? ఎప్పుడూ తను అందరికీ గుడ్‌మార్నింగ్ చెప్పేవాడు. కాని ఈరోజు కాన్ఫరెన్స్ హడావుడిలో పడి...!

బీరువా తెరచి బాండెడ్ లేబర్‌కు సంబంధించిన ఫైళ్ళు వరసగా టేబుల్ మీద ఉంచాడు. ప్రస్తుతం వాటిలో దాదాపు పది కేసుల మీద యాక్షన్ జరుగుతున్నది తరతరాల నుంచి వూడిగం చేస్తూ బానిస బ్రతుకులు గడుపుతున్న బీద ప్రజలకు విముక్తి కలిగించడం, వారికి ఆర్థిక స్థిరత్వం కలిగించి, సమానత్వం కోసం కృషిచేయడం ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న పని.

"సార్! తమర్ని హెడ్ క్లర్క్ అయ్యగారు రమ్మంటున్నారు" ప్యూన్ నరసింహులు చెప్పాడు.

"వస్తున్నా" అన్నాడు ఫైళ్ళు సర్దుతూ.

రెండు నిముషాల తేడాలో "తమర్ని దొరగారు రమ్మంటున్నారు" అని తహశీల్‌దారు జవాను పీరు సాహెబ్ వచ్చాడు.

"ఇదుగో వస్తున్నా" అంటూ మొదట హెడ్‌క్లర్క్ దగ్గరకు బయల్దేరాడు.

హెడ్ క్లర్క్ సీటులో లేడు.

నేరుగా తహశీల్దార్ దగ్గరకు వెళ్ళి చేతులు వెనక్కు కట్టుకుని వంచిన విల్లులా నిలబడ్డాడు.

అక్కడే ఉన్న హెడ్ క్లర్క్ భజగోవిందం విషపు నవ్వొకటి నవ్వి 'అనుభవిస్తా ఉండు' అన్నట్టు విలన్ చూపొకటి విసిరాడు.

"ఏమయ్యా? కాన్ఫరెన్స్ పర్టిక్యులర్సంతా తప్పుడు లెక్కలేనా? ఇది మినిస్టర్ చూసేదనుకున్నావా, లేదా" అన్నాడు తహశీల్దార్.

"నే చేసినదాంట్లో తప్పేమీ లేదు సార్! కావాలంటే ఫైల్సు అన్నీ తమరి దగ్గరకు తీసుకొస్తాను. మొదటినుంచీ కూడా ఇదే ఫిగర్ వేస్తున్నాము."

"అది సరేలేవోయ్! మొత్తం నలభై ఎనిమిది బాండెడ్ లేబర్ కేసులు ఉన్నాయి. అందులో పది కేసులమీద మాత్రం యాక్షను తీసుకున్నట్లు, మిగతా ముప్పై ఎనిమిది కేసులు బాలెన్సు చూపించావు, అవునా!"

"అవును సార్!"

"అదే మన కలెక్టరూ, డిప్యూటీ కలెక్టరూ అయితే అందులోని సాధక బాధకాలు తెలుసు కాబట్టి పైకి తిట్టినా కాగితంమీద పెట్టరు. అదే మినిస్టరుకు ముప్పై ఎనిమిది కేసులు పెండింగు చూపిస్తే నేనెక్కడ ఉంటాను? ఏ అడవుల్లో జంతువులమీదనో, సముద్రంలో చేపలమీదనో తహసిల్దారుగా వేస్తాడు... అవునా!"

"చిత్తం సార్!"

"అప్పుడు నేనేం చేస్తాను? క్లర్కు సరిగా చేయడంలేదని నీకు ఛార్జి మెమో ఇచ్చి నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తాను. తరవాత నేను ఫలితం అనుభవిస్తాను కాబట్టి అన్నీ సక్రమంగా జరగాలంటే మన హెడ్ క్లర్కు చెప్పినట్టు చెయ్...ఇక వెళ్ళు"

'మరేమనుకున్నావు నా తడాఖా' అన్నట్టు చూశాడు హెడ్ క్లరు, సినిమాల్లో హీరో రాక్షసుణ్ణి చెట్లతో, కొండలతో పోరాడి చంపేస్తే శవం పొట్టమీద కాలుపెట్టి, మీసం మెలివేసిన అంజిగాడిలా ఉన్నాడు.

"సార్! తమరు ఏం చెయ్యమంటారో చెప్పండి?" సీట్లో కొచ్చిన తరవాత అడిగాడు హెడ్‌క్లర్కుని.

హెడ్‌క్లర్కు ఒక్కసారి తల విదిలించి, నశ్యం పీల్చి, బాటరీ చార్జి చేసుకున్న తరువాత సుడిగాలిలా నెట్టుకు వచ్చిన తుమ్మును కంట్రోలు చేసుకోలేక, టేబిలుమీద కాగితాలు నాలుగంగుళాలు లేచేట్లు ఒక తుమ్ము తుమ్మి సర్ది కూర్చున్నాడు.

"ఉదయం నుంచి చూస్తున్నాను. ఒక్క పార్టీ రావడం లేదోయ్ గొంతు ఎండుకు పోతున్నదనుకో"

సుందరరావుకు పరిస్థితి అర్థమయింది. జేబులోంచి పది పది పైసల బిళ్ళలు ఏరి ప్యూనును ఒక కాఫీ తెమ్మన్నాడు.

"అదేమిటోయ్! నా కొక్కడికే తెప్పిస్తున్నావ్, మరి నువ్వు తాగ వేంటి?" నవ్వాడు.

"దాందేముంది లెండి సార్! తమరు పెద్దవాళ్ళు, ఎంతైనా మేము మీ తరవాత వాళ్ళమే కదా."

"అరే! సుందర్రావ్! నీకింత అమోఘమైన తెలివితేటలు, అణుకువ ఉన్నాయని నేను కల్లో కూడా అనుకోలేదోయ్! తొందరలో పైకొస్తావ్.

నీకంటే వయసులో చిన్న వాళ్ళయినా ఉద్యోగంలో నీ కంటే పెద్దవాళ్ళ మమ్మల్ని గౌరవించడం తెలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు భజగోవిందం ప్యూను చేతిలోంచి తీసుకున్న కాఫీ చప్పరిస్తూ.

"అయ్యా తమర్ని చిన్నదొరగారు కాన్ఫరెన్సు ఫైలు తెమ్మంటున్నారు" హెడ్ క్లర్కు నుద్దేశించి అన్నాడు డిప్యూటీ తహసిల్దారు జవాను రాఘవులు.

"బోడి ఎవరయ్యా ఆ డిప్యూటీ తహసిల్దారు? నిన్నగాక మొన్న వచ్చిన ఆ కాలేజీ బుజ్జబ్బాయేనా! మొత్తం నా కాజువల్ లీవంత సర్వీసుందో లేదో నన్నే ఫైలు తెమ్మంటాడూ? ఏం తెల్పని? నేను తేనన్నానని చెప్పు. ఫో" రౌద్రంగా అరిచాడు హెడ్ క్లర్కు, తన వయసుకు గుర్తుగా చెంపల మీదున్న తెల్లవెంట్రుకలను ప్రక్కకు నెట్టుకుంటూ.

"అలాగే సార్!" కీ ఇచ్చిన బొమ్మలా వెనక్కు తిరిగాడు రాఘవులు. పులిలా గాండ్రించిన హెడ్‌క్లర్కు మరుక్షణంలో పిల్లిలా మ్యావ్ అంటూ ఏడ్చాడు. "ఒరేయ్! రాఘవులూ! నిజంగా చెప్పబోతురా నేను బి. ఏ లో ఏదో అన్నాను. అయనెక్కడా, నేనెక్కడా! ఆయన ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దారు. రెండేళ్ళలో తహసీల్దారు, నాలుగేళ్ళలో డిప్యూటీ కలెక్టరు అవుతాడు. నేనా హెడ్‌క్లర్కుగా రిటైరయ్యేవాణ్ణి. తరువాత నా ఎముకలు ఏరేస్తాడు. ఒరేయ్ రాఘవులూ! నీవు వెళ్ళకు. ఇక్కడే ఉండు. నేనే వెళ్ళి చిన్న దొరగారికి కనిపిస్తాను. ఇదిగో— ఈ రెండు రూపాయలుంచుకో" అంటూ రాఘవులు చేతిలో ఒక రూపాయి ఉంచాడు.

రాఘవులు చేతిలోని నోటును అటూ ఇటూ త్రిప్పి చూసాడు. "మరేం అనుకోకు- ఒక్కసారిగా రెండు రూపాయలు ఇవ్వాలంటే నాకు

జ్వరం వస్తుంది. రేపొక రూపాయి ఇస్తాన్లే?" అంటూ, "అయ్యా, సుందరరావ్, పరిస్థితులు బాగా లేవు నాయనా! ఇవిగో నీ కాఫీ డబ్బులు, అదిగో నీ విచ్చిన నోట్పులో బాలెన్సు ముప్పై ఎనిమిది కేసులని, యాక్షను పదికేసులమీద మాత్రమే జరిగిందని వ్రాశావు. అది అంతా తిప్పి ముప్పై ఎనిమిది కేసులమీద యాక్షను తీసుకున్నట్లు పది కేసులు పెండింగులో ఉన్నట్లు వ్రాసి సంతకం పెట్టు. ఇదే తహసీల్దారు దొర గారు చెప్పింది. సందేహించకు, నాయనా! అవతల నా ప్రమోషను ఆగి పోద్ది" హడావిడిగా కాగితాలు తీసుకుని హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ తహసీల్దారు రూమువైపు ఎగిరాడు భజగోవిందం.

సుందరరావు తన సీట్లో కూర్చుని ఆలోచించసాగాడు. తనిప్పుడు ఇచ్చిన తప్పు ఫిగర్ మినిస్టరు గారికి అర్థం కాకపోయినా, కలెక్టరుగారికి తప్పక అర్థమవుతుంది. తహసీల్దారు తప్పు తన మీదకు నెట్టేస్తాడు. తన ఉద్యోగం పోతుంది నిజానికి ప్రపంచమే మోసం, బీరువా తెరిచి ఫైళ్ళు టేబిలుమీద వేశాడు.

"సార్! మీ అర్జంటు టపాలు తీసుకోండి" అంటూ ఒక ఇరవై కాగితాలు మడిచి టేబిలుమీద పెట్టాడు టైపిస్టు.

'ప్రతిదీ అర్జంటే. వీటిలో సగం వాటికైనా జవాబు వ్రాయాలి' అనుకుంటూ వాటిని వేటికి సంబంధించిన ఫైళ్ళలో వాటిని ఉంచసాగాడు.

"సార్ తమర్ని చిన్నదొరగారు రమ్మంటున్నారు" పిలిచాడు రాఘవులు.

"ఇదిగో వస్తున్నా" అంటూ కొద్ది సేపట్లో డిప్యూటీ తహసీల్దారు కెదురుగా నిలబడ్డాడు.

"సుందరరావుగారూ! మీరు కూర్చోండి" కుర్చీ చూపించాడు డిప్యూటీ తహసిల్‌దారు.

"ఫరవాలేదు సార్"

"ఫరవాలేదు ఏమిటండీ! ఇక్కడ అందరూ సమానమే. ముందు కూర్చుని మాట్లాడండి"

"ఏమిటండీ! మీ నోట్సు అంతా తప్పుడు లెక్క వేశారు-పోయిన నెలకు, ఈ నెలకు ఇంత తేడానా?"

మెత్తని సోఫాలో కూర్చోపెట్టి తెగిపోయిన పాత చెప్పుతో కొట్టి నట్లయింది సుందరరావు పని. కొద్దిసేపు నీళ్ళు నమిలాడు. ఏం చెప్పాలి? ఏం చెప్పినా తప్పు తనదే అవుతుంది. తహసిల్‌దారు ఈ పని చేయ మన్నాడని చెప్పగలడా!

"హెడ్ క్లర్కు వెయ్యమంటే వేశాను సార్"

"హెడ్‌క్లర్కు ఏం చెయ్యమంటే అది చేస్తారా! ఇంకో నెల పోతే అసలు కేసుల్లో పెండింగులే లేవని వ్రాస్తారు. నిజం తెలిస్తే ఎవరి పరువు పోయేది? మన వాళ్ళకు అది అలవాటే. మా దేశం ఇంత గొప్ప అంత గొప్ప అని ఇతర దేశాల్లో చెప్పకుంటారు. తీరా వాళ్ళు వచ్చి చూస్తే బస్సు స్టాండుల్లో డజన్ల మంది బిచ్చగాళ్ళు...దేవాలయాల్లో వందలకొద్దీ ముష్టివాళ్ళు...ఇక రైళ్ళలో టికెట్‌లెస్ ట్రావెలర్స్ వేలకొద్ది వున్నారు. ఇక బజార్లలో చూద్దామా అంటే నడిచే ప్రతి ముగ్గురిలోనూ ఒకడు కటిక దరిద్రుడు. ఇట్లా వుందయ్యా సిరిసంపదలతో తులతూగే భారత దేశం..."

"నే చెప్పేదేమంటే మనమంతా గవర్నమెంటు సేవకులం. గవర్న మెంటు ఏదో జీతం ఇస్తుంది కాబట్టి మనం దానికి సమానంగా సేవ

చేయాలి. ఇలా మనల్ని మనం మోసం చేసుకొంటూ ఉంటే నష్టపడే దెవరయ్యా అంటే నష్టపడే దెవరయ్యా అంటే మన జీతాల్ని పన్నుల రూపంలో చెల్లించే ప్రజలు..." ఆవేశంతో వూగిపోయాడు కుర్ర ఆఫీసర్.

"హెడ్‌క్లర్కు నాకేం తెలియదంటున్నాడు. దీనికి మీ జవాబేమిటి?" అన్నాడు డిప్యూటీ తహసిల్‌దారు!

"చిత్తం" అన్నాడు ప్రక్కనే ఉన్న హెడ్‌క్లర్కు. సుందరరావు దృష్టిలో పురాణాల్లో విన్న కలహభోజనుడు నారదుడులా కన్పించాడు. అన్నీ చేసి చివరకు నాకేం తెలియదు అంటున్నాడు.

సుందరరావుకు ఏం చేయాలో తెలియడం లేదు గంట కొట్టి గంటయినా రాని రైలులా అతని నోట్లోంచి మాట రావడంలేదు. చివరకు "దాన్ని సరిచేసి ఇస్తాను సార్" అని మాత్రం అనగలిగాడు.

"ఇంకేమిస్తావయ్యా! ఒరిజనలు కాపీ పెద్ద దొరగారి దగ్గరుంది. కార్బను కాపీలే మనదగ్గరుండేది! కాబట్టి ఇక నుంచయినా జాగ్రత్తగా వుండమంటున్నారు చిన్న దొరగారు" రెండు పిల్లులకు రాజీ చేసిన ధోరణిలో అన్నాడు.

"అనవసరంగా మాట్లాడకండి, హెడ్‌క్లర్కు గారూ! మీరుండేది దేనికి అంటాను. ఈ విషయాలన్నీ మీరు చూసి కదా పైకు పంపాల్సింది? పిల్లి కళ్ళు మూసుకొని పాలుతాగుతూ "తననెవ్వరూ చూడ లేదనుకొంటుంది. నాకు ఆఫీసులో ఎవరు ఏమేం చేస్తున్నది ఎప్పటికప్పుడు తెలుస్తూ వుంటుంది..."

"ఇక వెళ్ళొచ్చు" అన్నాడు. సుందరరావు వెళ్ళి తన సీట్లో కూర్చొన్నాడు.

ఫైలు తీసి చదువసాగాడు...ఏ పెద్దయ్యగారు రమ్మంటున్నారు. పీరు సాహేబు పిలుపుకు తలెత్తాడు. ఫైలు కట్టి తహశీల్‌దారు కెదురుగా నిలబడ్డాడు.

"ఏమయ్యా?... నేన్ని సేఫ్ సైడ్ కోసం చేస్తే తప్పుడు లెక్క నీ చేత చెప్పి చేయించానని డిప్యూటీ తహశీల్దారుతో చెబుతావా... అసలు నీకు తహశీల్దారొకరున్నారనయినా గుర్తుందా...నే ననుకొంటే నీ ఇంక్రి మెంటు కట్ చేస్తాను... ఈ అడ్మినిస్ట్రేషన్‌లో డిసిప్లిన్ లేకుండా పోయింది. ఛీ—ఛీ—ఏం మనుషులో. జీతం తేరగా వస్తుంది కాబోలు."

భారంగా వచ్చి సీట్లో కూర్చొన్నాడు. టైమ్ చూస్తే మూడున్నర యింది. ఈ హడావుడిలో మధ్యాహ్నం భోజనాని క్కూడా వెళ్ళలేదు. లేద్దా మనుకొంటూండగా పీరు సాహెబు పరుగెత్తుకొని వచ్చాడు. "సార్ తమర్ని బంగాళా దగ్గరకు వెళ్ళి అరేంజిమెంట్సు చూడమన్నారు, అయ్య గారు చిన్నయ్యగారు జీపులో వస్తారట."

సుందరరావు చుట్టూ చూశాడు. గుమస్తాలలో చాల మంది బాతా ఖానీలు వేసుకొంటున్నారు. తహశీల్దారు ఏదయినా పని చెపితే నిర్దాక్షిణ్యంగా ఎగ గొడతారు. వాళ్ళంతా అంతా ఇంతో ఇన్‌ఫ్లుయన్సు వున్న వారు. ఇద్దరు మినిస్టరు తాలూకు మనుషులు. మరిద్దరు పై లెవల్లో పలుకు బడి వున్నవారు. ఇంకొకాయన తహశీల్దారు అన్న కొడుకు. వీరిని ఏమ యినా అనాలంటే తహశీల్దారుకు చాలా భయం. మొదటిది తన ఉద్యోగం ఏమవుతుందోననేది. రెండవది—తన మాటలు వారు ఖాతరు చెయ్యకపోతే పరువు పోతుందని. ఇక పోతే మిగతా తనలాటి గుమస్తాలు ఇల్లు వాకిలి వదులుకొని గొడ్డులాగా చాకిరీ చేస్తూనే వున్నారు

తనేమైనా ఎదిరిస్తే ఉన్నదీ లేనిదీ కలిపి కలెక్టరుకు పనిచేయడం లేదని రిపోర్టు చేస్తారు. దాంతో తనను ఎక్కడికో ట్రాన్స్‌ఫర్లు చేస్తారు.

చాలీ చాలని జీతంతో వున్న వూళ్ళోనే బ్రతకలేని తను వేరే వూళ్ళో అద్దె కొంపలో సంసారం ఈదగ్గలడా? అందుకే తన వీక్‌నెస్ గుర్తించి వీళ్ళిలా మాట్లాడుతున్నారు.

సుందరరావు ట్రావెలర్స్ బంగళా ముందున్న టీకొట్లో ఒకకప్పు 'ఛా' త్రాగి గేటు ముందు తచ్చాడసాగాడు. ఆరుగంటల ప్రాంతంలో తాహశీల్‌దారు డిప్యూటీ తహశీల్‌దారు ఒకసారి వచ్చి చుసి 'కలెక్టరాఫీసు నుంచి మినిస్టరొస్తున్నట్టు ఫోనొస్తే తమకు తెలియజేయ'మని చెప్పి వెళ్ళి పోయారు.

రాత్రి పది గంటల సమయంలో రెవెన్యూ మినిస్టరుగారు ఆ రోజుకు రారని, మరుసటిరోజు ఉదయం తొమ్మిది గంటలకు రాబో తున్నారని కలెక్టరాఫీసు నుంచి ఫోనొచ్చింది. వెంటనే తాలూకాఫీసు వైపు బయలుదేరాడు సుందరరావు.

"సార్!... పెద్దమ్మాయిని చూడ్డానికి వస్తున్నారు రేపు ఒక గంట పర్మిషనివ్వండి" నసుగుతూ రిక్వెస్టు చేసుకొన్నాడు సుందర రావు.

తహశీల్‌దారు జీపులో కూర్చున్నవాడల్లా తల బయటపెట్టాడు. "మిస్టర్ సుందరరావ్! నీవు ఉదయం నుంచి ఎన్ని కాగితాలు వ్రాశావ్" అన్నాడు.

సుందరరావ్‌కు షాక్ తిన్నట్లయింది. తనకు ఉదయం నుంచి ఇప్పటి వరకు అటూ ఇటూ తిరగనే సరిపోయింది. ఇక ఏం వ్రాస్తాడు?

"చిత్తం...ఏం వ్రాయలేదు సార్."

"ఈ రోజు నీ కూలిపాటు గూడా గిట్టుబాటు లేదు కదయ్యా? ఏం చేశావని రేపు పర్మిషన్ కావాలి నీకు? అడగడానికి సిగ్గెట్టా లేదయ్యా?

పర్మిషను లేదు, గిర్మిషను లేదు...రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా ఆఫీసులో లేకపోతే పనిష్మెంటు మాత్రం వుంటుంది. డ్రైవర్ ! పోనియ్" అన్నాడు.

సుందరరావు ఇల్లు చేరుకునేసరికి అందరూ నిద్రపోతున్నారు. విరిగిపోయిన గుంజ నానుకొని తెగిపోయిన గాలిపటంలా వూగుతోంది సావిత్రి. భోజనం అయిందనిపించి కుమార్తె ముఖంలోకి ఒకసారి చూశాడు. అమాయకంగా చెల్లెలి నడుంమీద చేయివేసి నిద్రపోతోంది. ఒక మంచంమీద తండ్రి ప్రక్కనే చాప పరచుకొని ముసలి తల్లి నిద్ర పోతున్నారు మిగతా ముగ్గురు పిల్లలూ లావుపాటి జంపఖానా మీద అస్తవ్యస్తంగా దొర్లుతున్నారు.

సావిత్రి తాగుతూ మరో రోజు కార్యక్రమం గురించి ఏదేదో చెబుతూ వుంది. సుందరరావుకు అవేమీ వినిపించడం లేదు. తనకు ఈ రోజు జరిగిన అవమానం గురించి, ఒక రోజు కూడా సెలవు దొరకని తన జీవితం గురించి ఆలోచిస్తున్నాడు.

దూరంగా మైక్‌లోంచి ఏదో సినిమాలో పాట వినిపిస్తూ వుంది. "లగి జిగి...లగిజిగి...ఎదురు తిరగరన్నా...నువ్వు ఎదురు తిరగ రన్నా..." ఆ పాటే అతని జీవితంలో ఎన్నో అద్భుతమైన మార్పులను తెస్తుందని ఆ క్షణంలో వూహించలేకపోయాడు.

తన మెతకదనం చూసి ఆఫీసర్లు నెత్తిన మొట్టుతున్నారు లేకపోతే నిన్నగాక మొన్న వచ్చిన గుమాస్తాలు పని ఎగ్గొట్టి తిరుగుతూ ఉంటే, తనింత కష్టపడి పనిచేసి సీనియర్ల దగ్గర తిట్లు తింటున్నాడు. గవర్న మెంటు రూల్సు అంటూ కొన్ని వున్నాయి. కాబట్టి రేపట్నుంచి వాటినే తను ఫాలో అయితే సరిపోతుంది. ఏమవుతుందో చూస్తాం అనుకున్నాడు. ఆ నిర్ణయానికి రాగానే తృప్తిగా నిద్రపట్టింది సుందరరావుకు.

మరుసటి రోజు కావాలనే పట్టుదలగా ఎనిమిది గంటలకు నిద్ర లేచాడు. పెద్ద అమ్మాయిని పరామర్శించాడు. పిల్లలిద్దర్నీ దగ్గరుండి స్కూలుకు పంపేడు. చిన్నపిల్లనూ, చంటివాణ్ని ఆడిస్తూ గడిపాడు. తలిదండ్రుల యోగక్షేమాలు దగ్గరుండి కనుక్కొన్నాడు. ఇతని ప్రవర్తన ఇంట్లో వాళ్ళందరికీ ఆశ్చర్యంగా వుంది. ఆనందంగానూ వుంది. బాధ్యతలు పట్టకుండా ఆఫీసే స్వర్గం అనుకొని ఉదయాన్నే ఆరు గంటలకే నిద్రలేచి మజ్జిగన్నం టిఫిన్ బాక్సులో పెట్టుకొని వెళ్ళి రాత్రి పది గంటలకు తిరిగి వచ్చే సుందరరావేనా అని.

అంతకంటే ఆశ్చర్యం...ఉదయం పది గంటలకు సుందరరావుకు, తాలూకా ఆఫీసు ప్యూను పీయ సాహెబుకు జరిగిన సంభాషణ.

"మినిష్టరుగా రొచ్చారు. తమర్ని అయ్యగారు పిలవమని చెప్పారు."

"ఈ రోజు పబ్లిక్ హాలిడే. నాకు వేరే పనుంది. రానన్నానని చెప్పు"

ప్యూను ఆశ్చర్యపోయాడు. "తమరు..."

"గెటవుట్... సెలవురోజు రానన్నానని చెప్పు. దట్సాల్!" లోపలికి వెళ్ళిపోయాడు సుందరరావు.

తెరిచిన నోరు అలాగే వుంది ఆఫీసుకు వెళ్ళాడు ప్యూను.

మరుసటి రోజు సరిగ్గా పది గంటలా ఇరవై తొమ్మిది నిముషాలు దాటి యాభై తొమ్మిది సెంకడ్ల ప్రాంతంలో తన సీట్లో కూర్చున్నాడు సుందరరావు

అప్పటికే సుందరరావు ప్రవర్తన ఆఫీసంతా తెలిసిపోయింది. ఒక్కచిక్కిన పిల్లి వుండే సుందరరావు గాయపడిన బెబ్బులిలా ఎందుకు

మారాడా అని ఆఫీసులో అంతా ఆలోచిస్తున్నారు. కాని సుందరరావు ఇదేమీ పట్టించుకోవడం లేదు

"తమర్ని అయ్యగారు రమ్మంటున్నారు" పీరు సాహెబ్ చెప్పాడు.

"ఎస్.. కమింగ్" అంటూ కాలరు సర్దుకొని సీట్లోంచి లేచాడు. అతనికి దారి ఇస్తూ ప్రక్కకు తప్పుకొన్నారు ఎదురు వస్తున్న వాళ్ళంతా.

నేరుగా వెళ్ళి తహశీల్‌దారుకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. అడక్కుండానే తన కెదురుగా నిలబడడానికే సాహసించని సుందరరావు ఇలా కూర్చొనేసరికి తహశీలుదారు తన ప్రిస్టేజి మంటగలిసినట్లు భావించి దుఃఖాన్ని దిగమ్రింగుకొన్నాడు.

"సుందర్రావుగారూ ! నిన్న పిలిచినా మీరు రాలేదు. అందుకని మీకు చార్జి మెమో ఇచ్చి నెలరోజులు సస్పెండ్ చేస్తున్నాను."

"నో... నో... దట్ ఈజ్ నాట్ యువర్ బిజినెస్... సెలవు రోజు ఆఫీసుకు రాలేదని చార్జి మెమో ఇస్తే దానికి సంజాయిషీ రెడీగా వుంది. సస్పెండు చేయడం మీ వంతు కాదు. దేర్ ఆర్ రూల్స్. ఆ విషయం కలెక్టరుగారికి సంబంధించినది. అదీ నా సంజాయిషీ, సమంజసంగా లేకపోలేదే సుమా..." హాపీగా నవ్వాడు సుందరరావు.

"గెటప్... అండ్... గెటవుట్!" అగ్నిలో అజ్యం పోసి దాన్ని విసిరినట్లయింది అతని పరిస్థితి.

"అది ఎన్నటికీ జరగదు."

"నేను తహశీల్‌దారును. అయామ్ ది తాలుక్ మెజిస్ట్రేట్"

"కావచ్చు... పెను తుఫానుకు మహావృక్షం సహితం కూకటి

వేళ్ళతో కూలిపోతుంది. చిన్న వుద్యోగులం మేమంతా రూల్సు ప్రకారం పోతే మీ పని గోవిందా... టిట్... ఫర్ టాట్ !". పెద్దగా నవ్వాడు సుందరరావు

అప్పటికే ఆఫీసు స్టాఫంతా కిటికీల్లోంచి వినోదం చూస్తున్నారు. హెడ్ క్లర్క్, డిప్యూటీ తహశీల్‌దారు రూములోకి వచ్చి గలభా సర్దడానికి ప్రయత్నిస్తున్నారు.

"ఎందుకు పెద్ద మాటలు... ఏనుగు-గడ్డిపోచలు, పాము-చీమలు, పులి-బోను కథలు మరొకసారి చదవండి. ఎంతవాడయినా న్యాయానికి తల వంచక తప్పదు"

"ఐ సే డోన్ట్ టాక్!" తహశీల్‌దారుకి బి.పి. మరీ ఎక్కువై టేబుల్ని గట్టిగా గుద్దాడు. ఆ వూపుకు దాని మీదున్న పేపరు వెయిట్ అరడుగు ఎత్తు ఎగిరి ప్రక్కనే ఉన్న డిప్యూటీ తహశీల్‌దారు పాదం మీద పడింది. దాంతో ఆయన నరాలు జివ్వుమన్నాయి. కోపంతో చుట్టూ చూశారు. ఎవర్ని తిట్టాలో అర్థంకాక ఏదో అర్థంటు పనున్నట్టు తన రూముకి వెళ్ళి కాలు సర్దుకోసాగాడు.

తహశీల్దారు కోపంలో ఏదేదో అంటున్నాడు. సుందర్రావు "బి... పొలైట్... ఐ సే... బి పొలైట్" అంటూ మధ్య మధ్య గుర్తు చేయసాగారు. కాని చివరికి హెడ్ క్లర్క్‌తో అన్నాడు తహశీల్‌దారు. "సుందరరావు మీద ఛార్జెస్ ఫ్రేమ్ చెయ్యండి. అతని ప్రవర్తన బాగా లేదు" హెడ్ క్లర్కు ఎప్పుడెప్పుడా అన్నట్లు తన సీట్లోకి వెళ్ళి చార్జి మెమో వ్రాయసాగాడు.

కొద్దిసేపట్లో సుందరరావుకు చార్జి మెమో ఇచ్చారు. సుందరరావు దానికి సంజాయిషి వ్రాసి ఇచ్చాడు! చార్జి మెమోకు దాన్ని పెట్టి సుందర

రావును నెల రోజులు సస్పెండు చేయాలని కోరుతూ కలెక్టరుకు వ్రాశారు తహశీల్‌దారు. నాలుగు రోజుల్లో అదే విధంగా కలెక్టరు నుంచి ఆర్డర్సు వచ్చాయి.

సుందరరావు అప్పట్నుంచి వూరుకోలేదు ఈ విషయం ప్రతి ఎన్ జి ఓ కు వివరించి ఎన్.జి.ఓస్ అసోసియేషన్‌ను తనవేపు తిప్పుకున్నాడు. మిగతా ఎంప్లాయీస్ అసోసియేషన్‌లన్నీ ఇందులో కలిశాయి. తాలూకా అసోసియేషన్ డిస్ట్రిక్టు అసోసియేషన్‌లతో చర్చించాయి ఈ విషయాన్ని డిస్ట్రిక్ట్ అసోసియేషన్ స్టేట్ అసోసియేషన్‌కు నివేదించాయి. స్టేట్ అసోసియేషన్ తీవ్రమయిన చర్య తీసుకొంది. సుందరరావు సస్పెన్షనుకు నిరసనగా స్టేట్ స్టేటంతా సమ్మెలు, నిరహార దీక్షలతో నిండిపోయింది. వీరందరికీ సుందరరావు నాయకుడయ్యాడు. క్రమేణా ఈ విషయం ప్రతి ఒక్కరికీ ముఖ్యమైపోయింది. పేపర్‌లో సుందరరావు పేరు పడని రోజు లేదు. చివరకు ప్రభుత్వపాలనే స్తంభించిపోయింది.

దానితో గవర్నమెంట్ ఒక జి.ఓ పాస్ చేసింది. అయిదు సంవత్సరాలున్న ప్రతి ఉద్యోగికి ప్రమోషన్ నివ్వాలని, సుపీరియర్సు సబార్డినేట్సును చులకనగా చూడరాదని ఇందులోని సారంశం.

ప్రస్తుతం అయిదు సంవత్సరముల సర్వీసుకో ప్రమోషను చొప్పున బేరీజు వేసి సుందరరావుకి డిప్యూటీ తహశీల్‌దారు ఉద్యోగమిచ్చారు. ఇతని పుణ్యమా అని రాష్ట్రమంతా మేలు జరిగింది. ఇంతకు ముందు వున్న తహశీల్‌దారును ఎక్కడికో మారుమూలకు మార్చారు.

ఇప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. సుందరరావు ఆర్థిక పరిస్థితులు కూడా చక్కబడ్డాయి.

• • • •

బయట 'టకా టకా' మని చప్పుడయ్యేసరికి తలుపు తీశాడు సుందరరావు. ఎదురుగా ఫ్యాను పీరుసాహెబ్ నిలబడి వున్నాడు. అయితే అప్పటివరకూ తను కన్న తీపి కలను మరిచిపోలేకున్నాడు.

"అయ్యగారు తమర్ని అర్జెంటుగా తీసుకురమ్మన్నారు"

"అరె...ఆలస్యమైపోయిందే" అనుకుంటూ త్వర త్వరగా తయారయి ఆఫీసుకి పరుగెత్తాడు పూర్ గుమాస్తా సుందరరావు ఆ రోజు ఆదివారం అన్న సంగతే మరిచిపోయి.

"బుద్ధుందటయ్యా! పది గంటలకు మిస్టరు వస్తూంటే ఎనిమిది గంటల కటయ్యా ఆఫీసుకు వచ్చేది. మేము ఆఫీసుకు వచ్చేసరికి నీవు ఆఫీసులో వుండల్నా... పన్లేదా..." ఆ రంకెలు విన్న తరువాత తను అటువంటి కలలు కనడానికి పనికిరానని అనుకున్నాడు పూర్ సుందరరావు.

"చేసేవాడుంటేనే చేయించుకొనే వాడుంటాడు. పడేవాడుంటేనే తిట్టే వాడుంటాడు. బాండెడ్ లేబర్‌ను నిర్మూలించాలంటూనే ప్రభుత్వం ప్రజల్లో ఒక భాగమయిన చిన్న ఉద్యోగస్థులచేత బాండెడ్ లేబర్ చేయిస్తుంది. ఇదేం న్యాయం! ఉద్యోగస్థులలో ఐకమత్యమే ఉంటే ఇలా జరుగుతుందా! ఒంటరిగా నిద్ర పట్టని రోజున ఇలా వాపోతుంటాడు సుందరరావు.

*